సీఎంఆర్‌టీసీలో మహిళా దినోత్సవం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌టీసీ కళాశాలలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాసా హైదరాబాద్ సైంటిస్ట్ జయ సక్సేనా, సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి, ఉమెన్ ప్రొటక్షన్ సెల్ హెడ్ కవితరాణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండల్‌రావుకు సంక్రాంతి పురస్కారం

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ అత్వెల్లికి చెందిన ప్రముఖ కవి తెలుగు ఉపాధ్యాయుడు గుండవరం కొండల్‌రావుకు జాతీయ స్థాయి సంక్రాంతి పురస్కారం లభించింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన శ్రీగౌతమేశ్వర సాహితీ కళాసేవా సంస్థ అవార్డు ప్రకటించగా ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పూడూర్‌లో మజీద్ ప్రారంభం

మేడ్చల్: మండలంలోని పూడూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మజీద్‌ను వక్ఫ్‌బోర్డు చైర్మన్ హజ్మతుల్లా హుస్సేన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను మండల ముస్లిం నాయకులు ఆయనను కలిసి సన్మానించారు. మండల నాయకులు యూసుఫ్, అఫ్సర్, ముజీబ్ తదితరులు ఉన్నారు.

60 మంది మహిళలకు ఇంప్రూవ్డ్ టూల్‌కిట్స్ పంపిణీ



కీసర: ప్రభుత్వం అందించే సహకారాన్ని అందిపుచ్చుకొని మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలని హస్తకళల సేవా కేంద్రం హైదరాబాద్ సహాయ డైరెక్టర్ అపర్ణ లక్ష్మీ అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీలోని జీవీఆర్ గార్డెన్‌లో 60మంది హ్యాండ్ ఎంబ్రాయిడరీ హస్త శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు ఇంప్రూవ్డ్ టూల్ కిట్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ టూల్స్ ఉపయోగించి మంచి ఉత్పత్తి సాధించాలని, తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు.

రెడీమిక్స్ ప్లాంట్ ఎత్తివేయాలని ధర్నా



ఘట్‌కేసర్: జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన రెడీమిక్స్ ప్లాంట్‌ను ఎత్తివేయాలని కాచవానిసింగారం గ్రామంలో స్థానికులు శనివారం ధర్నా చేపట్టారు. రెడీమిక్స్ ప్లాంట్‌తో దుమ్ముధూళితో పాటు కాలుష్యం పెరుగుతోందని, గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జనావాసాల మధ్య ఉన్న రెడీమిక్స్ ప్లాంట్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సీఎం సభకు కాంగ్రెస్ నాయకులు



ఘట్‌కేసర్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పాలొన్న మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ బహిరంగ సభకు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. అంతకుముందు కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్లు మశ్చేందర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నాగరాజ్‌ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, నార్ల మల్లేశ్‌యాదవ్, జంగారెడ్డి, బాల్‌రెడ్డి, దేవేందర్‌ముదిరాజ్, కార్తీక్‌యాదవ్, సుధాకర్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

మల్లాపూర్: శివరాత్రిని పురస్కరించుకొని మల్లాపూర్ శాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల చాందిని క్రికెట్ టోర్నీని స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 1959లో స్థాపించిన శాంతియూత్ క్లబ్ 65 ఏళ్లుగా క్రీడాలను ప్రోత్సహిస్తూ ఎంతోమంది క్రీడాకారులను తయారు చేస్తున్నందుకు క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మీర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, సలహాదారులు పీఆర్. ప్రవీణ్, నిర్వాహకులు రాజేష్, ఎస్వీ.శశి, రఘు, సంపత్, శ్రీనివాస్, మేఘరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన ఐఎన్‌టీయూసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు

కుషాయిగూడ: టీజేఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను శనివారం ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జయరాంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అయనకు శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్రంలో కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కార్యచరణ చేస్తున్న పలు అంశాలపై ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో స్కైలాబ్‌రెడ్డి, సునీల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

కుషాయిగూడ: కుషాయిగూడలోని ప్రో ఫ్యాషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, అభయ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి మహిళలకు ఆధునాతన టైలరింగ్, డిజిటల్ మీడియాలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అధ్యక్షురాలు ధీరం ఉష శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 15 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందని, ఆసక్తి గల మహిళలు ఫోన్: 89782 08945 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

కలల గూడు కోసం..



- సీఎం ప్రకటనతో ఇళ్ల దరఖాస్తు దారుల్లో ఆశలు
- మేడ్చల్ జిల్లాకు 17,500 ఇందిరమ్మ ఇళ్లు
- ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు 1.10 లక్షలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగింటిని ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసింది. మిగతా రెండు గ్యారెంటీల్లో ఒకటైనా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ నెల 11న ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సంబంధిత అధికారులను ఆదేశించిన నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయనుండటంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు 17,500 ఇందిరమ్మ ఇళ్లు రానుండటంతో దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారెంటీలకు సంబంధించి లబ్ధిదారులను గుర్తించేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని జీహెచ్‌ఎంసీ మున్సిపల్ సర్కిళ్లు, 13 పురపాలక సంఘాలు, 61 గ్రామ పంచాయతీల్లో 8 రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలపై అర్హులైన ప్రజలు, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున 7.09 లక్షల దరఖాస్తులు రాగా, అందులో ఇందిరమ్మ ఇళ్లు పథకానికి సంబంధించి 1,10,226 మంది దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించి ఇళ్ల నిర్మాణం కోసం మంజూరు పత్రాలు అందిస్తారు. సొంత స్థలం ఉన్నవాళ్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నచ్చిన రీతిలో నిబంధనల మేరకు ఇళ్లను నిర్మించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

ఏళ్లుగా ఎదురుచూపులు..

జీవిత కాలంలో సొంతగా ఇంటిని నిర్మించుకోగలమా అన్న ఆశతో జిల్లాలో వేలాది మంది నిరుపేదలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలో ఇంటి నిర్మాణం కోసం చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పేరుతో నిర్మాణాలు చేపట్టినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో నిరు పేదల కలలు సాకారం కానున్నాయి.

బీజేపీలోకి నాగారం మున్సిపల్ చైర్మన్?



నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. మేడ్చల్ జెడ్పీటీసీ సభ్యులు శైలజవిజయానంద్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన విషయం విధితమే. తాజాగా నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి కూడా బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి త్వరలో తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరనున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. నాగారం పంచాయతీ నుంచి మున్సిపల్ అప్‌గ్రేడ్ అయిన తర్వాత తొలి మున్సిపల్ చైర్మన్‌గా కౌకుట్ల చంద్రారెడ్డి ఎన్నికై నాలుగేళ్లు పూర్తి చేసుకున్న ఆయన మాజీ మంత్రి, ప్రస్తుత మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా చామకూర మల్లారెడ్డి గెలుపులో కీలక పాత్ర పోషించారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీతో పాటు ఉమ్మడి కీసర మండలంలో కూడా బీఆర్‌ఎస్ బలోపేతానికి ఆయన కృషి చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి తన అనుచరులతో బీజేపీలో చేరనున్నట్లు సమాచారం. ఎప్పుడు చేరతారన్న విషయంతో త్వరలో తెలియనుంది.

18న నూతన మేయర్ ఎన్నిక

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ నూతన మేయర్ ఎన్నిక ప్రక్రియ ఈ నెల 18వ తేదీన చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ మాజీ మేయర్ కావ్య అవిశ్వాసంతో పదవిని కోల్పోవడంతో నూతన మేయర్ ఎన్నిక అనివార్యమైంది. గత నెల 19న మాజీ మేయర్ కావ్యపై అవిశ్వాసం నెగ్గిన 20 మంది కార్పొరేటర్లు ప్రత్యేక సమావేశంలో నూతన మేయర్‌ను ఎన్నుకోవాలని తెలిపారు.

అలియాబాద్‌లో అన్నదానం



శామీర్‌పేట్: శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ గ్రామంలో అన్నదానం కార్యక్రమం శనివారం నిర్వహించారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని గ్రామ శివాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు కంఠం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మహిళలు, భక్తులు, గ్రామస్తులు అన్నదానంలో పాల్గొన్నారు.

కొత్త ఐడియాలను ప్రోత్సహించేందుకు టీహబ్ సిద్ధం



ప్రసంగిస్తున్న టీ హబ్ ఇన్నోవేషన్ మేనేజర్ స్వరూప

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు కొత్త ఐడియాలతో వస్తే వారిని వెన్నుతట్టి ప్రోత్సహించడానికి టీహబ్ సిద్ధంగా ఉందని టీహబ్ అకాడమిక్ ఇన్నోవేషన్ సీనియర్ మేనేజర్ స్వరూప గొర్రెపాటి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం వికసిత్ భారత్‌లో భాగంగా అమృత్ కాల్ వికసిత్ భారత్–2ను ఎంపవరింగ్ స్టూడెంట్స్ బై లేవరైజింగ్ ఇన్నోవేషన్ ఫర్ డ్రైవింగ్ అకాడమిక్ సక్సెస్ పేరుతో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద ఇన్నోవేషన్ సెంటర్ హైదరాబాద్‌లోనే ఉందన్నారు. వికసిత్ భారత్ ఇండియా అభివృద్ధి చెందడానికి గల సంస్కరణలు ఎలా ఉపయోగించుకోవాలని అనే దానిపై పనిచేస్తుందన్నారు. విద్యార్థులు ఉద్యోగాలు వెతుక్కొనే వ్యక్తులుగా కాకుండా ఉద్యోగాలను సృష్టించే వారిగా ఉండాలన్నారు. టీహబ్, టీవర్క్స్, టాస్క్, వెబ్‌హబ్, టీఎస్‌ఐకే, ఆర్‌ఐసీహెచ్ లాంటివి ఎన్నో ఇన్నోవేషన్ సెంటర్‌లో ఉన్నాయని వివరించారు. కొత్త ఆలోచనలతో వచ్చే వారికి ఎల్లప్పుడూ ప్రోత్సాహం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీలత, కళాశాల సెక్రటరి టీవి రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, కో ఆర్డినేటర్లు సరిత, మాళవిక, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌లో మహిళా దినోత్సవం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. వేడుకల్లో బిగ్‌బాస్–7 కంటెస్టెంట్ నయిని పావని పాల్గొని విద్యార్థినులతో సందడి చేశారు. కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా.వీఏ నార్యాణ, కల్చరల్ హెడ్ రోహిణిరెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేద్దాం



బోడుప్పల్: చిన్నతనం నుంచి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేద్దామని బచ్‌పన్ ఏహెచ్‌పీఎస్ రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌లో శనివారం జరిగిన బచ్‌పన్ యూకేజీ స్నాతకోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయాలతో ముందడుగు వేయాలన్నారు. చిన్నారులు ముద్దు ముద్దు మాటలతో అబ్బురపరిచే విధంగా తమ సందేశాన్ని అందించారన్నారు. విద్యార్థులు పోటా పోటీగా తమ వాక్చాతుర్యాన్ని కనబర్చారని, ఇది వారు భావి భారత పౌరులుగా ఎదిగేందుకు తొలిమెట్టు అన్నారు. విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం కాకుండా ఆటలు, పాటలు, నృత్యం, భాష పటుత్వం కలిగి ఉండే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ రూపారెడ్డి, ఆపరేషన్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నళిని జయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



బాలాజీనగర్‌లో వేస్తున్న మట్టిరోడ్డు

బోడుప్పల్: సమాజాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని బీఆర్‌ఎస్ 15వ డివిజన్ ఇన్‌చార్జి సిగురు రేణుక రవికుమార్ అన్నారు. బాలాజీనగర్ రోడ్డు అధ్వానంగా ఉండటంతో స్థానికుల వినతి మేరకు ఆమె రూ.50 వేల సొంత నిధులతో మట్టి రోడ్డు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15వ డివిజన్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు నడవడమే కష్టంగా ఉందన్నారు. బాలాజీనగర్‌లో రోడ్డు అధ్వానంగా ఉండటంతో స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారని, వారి అభ్యర్థన మేరకు మట్టి రోడ్డు వేయించినట్లు తెలిపారు. ప్రతి పనికి ప్రభుత్వం మీద ఆధారపడకుండా సొంత నిధులతో చిన్న చిన్న పనులు చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్‌లోకి మేడ్చల్ జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ నాయకులు



మధుయాష్కి, స్థానిక నేతలతో కాంగ్రెస్‌లో చేరుతున్న జెడ్పీటీసీ, నాయకులు

మేడ్చల్: సీఎం రేవంత్‌రెడ్డి మేడ్చల్ పర్యటన సందర్భంగా మేడ్చల్ బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మేడ్చల్ జెడ్పీటీసీ శైలజ, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు విజయానంద్‌రెడ్డి, శ్రీరంగవరం ఎంపీటీసీ ప్రకాశ్, మేడ్చల్ మున్సిపల్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామస్వామి, నాయకులు రాఘవేందర్‌గౌడ్, రవి ముదిరాజ్, వివిధ మండలాల నాయకులు, కార్పొరేషన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడానికి గుండ్లపోచంపల్లి వద్ద నిర్వహించిన సభా వేదిక వద్దకు వచ్చారు. వేదిక కుడి భాగంలో వారిని ప్రత్యేకంగా కూర్చోబెట్టారు. సీఎం రాక ఆలస్యం కావడంతో ఆయన నేరుగా వచ్చి ప్రసంగం చేసి వెళ్లిపోయారు. సీఎం వెళ్లిపోయాక మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, రాష్ట్ర నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్ వారిని పార్టీలో చేర్చుకున్నారు. దీంతో సీఎం చేతులమీదుగా పార్టీ కండువా కప్పుకోవాలని భావించి జంపింగ్ బ్యాచ్‌కు నిరాశ తప్పలేదు.

జంగయ్యా.. నవనీతకు టికెట్ ఇవ్వు



ఎదిగిన తీరును సీఎంకు వివరిస్తున్న నవనీత

మేడ్చల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా సంఘాలతో నిర్వహించిన ముఖాముఖిలో ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌కు చెందిన మహిళ నవనీత అనర్గళంగా మాట్లాడటంతో ఆమె మాటలకు ముగ్దుడైన ఆయన ఆమె రాజకీయాల్లోకి రావాలని కోరారు. అంకుషాపూర్ భవానీ పొదుపు సంఘం గ్రూప్ లీడర్ నవనీత తాను పొదుపు సంఘం అండతో ఎదిగిన తీరును సీఎం వివరించారు. ఆమె మాటలు ముఖ్యమంత్రిని ఆకర్షించడంతో ఆమె ఊరి పేరు తెలుసుకున్నారు. అక్కడే ఉన్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర జంగయ్యకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని ఆదేశించారు. నవనీత తప్పకుండా రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరారు.

గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో ఈటల ప్రచారం



గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులతో ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో పలు గేటెడ్ కమ్యూనిటీ కాలనీల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. పామ్ మెడోస్, నైబర్‌వుడ్, అపర్ణ మ్యారిగోల్డ్, కేనోపి కాలనీల్లో జిల్లా పార్టీ అధ్యక్షులు విక్రంరెడ్డి, నాయకులతో కలిసి పర్యటించి కాలనీవాసులను కలిశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరించి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసి తననకు గెలిపించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్లు సరస్వతి, హంసరాణి, నాయకులు కృష్ణాగౌడ్, రవీందర్‌గౌడ్, మహేశ్, శ్రీధర్, అశోక్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు..

మేడ్చల్ పట్టణానికి చెందిన పలువురు యువకులు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేశారు. మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో యువకులకు పార్టీ కండువాలు వేసి ఈటల రాజేందర్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

డబ్బు- ధర్మానికి మధ్య యుద్ధం

మేడ్చల్‌రూరల్: మల్కాజిగిరి పార్లమెంట్‌లో రానున్న ఎన్నికల్లో డబ్బుకు ధర్మానికి మధ్య యుద్ధం జరుగుతుందని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలోని ఆయన నివాసంలో శనివారం రాత్రి సోషల్ మీడియా బాధ్యులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రాన్ని దోచుకున్న పార్టీలు ప్రభుత్వాల్లో ఉన్న సమయంలో అడ్డగోలుగా సంపాదించారని, దేశం కోసం పాటు పడుతున్న బీజేపీకి ఆ దోపిడీ పార్టీలకు మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ధర్మాన్ని నిలబెట్టి పని చేసే భాగ్యం తనకు కల్పించాలని కోరారు.

ఆధ్యాత్మిక గ్రంథాలయం ప్రారంభం

మల్కాజిగిరి: సీఫెల్ కాలనీలోని సిద్ధివినాయక దేవాలయంలో కమిటీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆకర్షణ ప్రారంభించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుభాష్ మాట్లాడుతూ ఆకర్షణకు గ్రంథాలయాల ఏర్పాటు పట్ల ఆసక్తి ఉండటంతో పలు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక గ్రంథాలయాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రధాన మంత్రి మోదీ సైతం మన్‌కీబాత్‌లో ఆకర్షణను అభినందించారన్నారు. సీఫెల్ కాలనీలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి ఆమె తండ్రి సతీష్ షెల్ఫ్‌లను అందజేశారు.

వైభవంగా విమాన రథోత్సవం





శివలింగాలకు అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన శనివారం స్వామి సన్నిధిలో వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి వేదపండితులు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. మరోపక్క దేవాలయం పక్కన ఉన్న యాగశాలలో హోమాన్ని టీటీడీ వేదపాఠశాల వేదపండితులు గణపతిశర్మ, వేద విద్యార్థులతో కలిసి నిర్వహించారు. సామూహిక అభిషేకాల్లో భక్తులు పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు ప్రదోషకాల పూజ, హారతి, మంత్ర పుష్పం తదితర పూజలను నిర్వహించారు. రాత్రి 8 గంటల తర్వాత కొండ దిగువన గల పార్క్ సమీపంలో స్వామివారికి విమాన రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం రథానికి పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. తెల్ల తామర కొలను వరకు కొనసాగిన రథోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వినాయక్‌నగర్‌లో లక్ష దీపార్చన

మేడ్చల్: శివరాత్రి సందర్భంగా పట్టణంలోని వినాయక్‌నగర్ రోడ్ నంబర్–2లో కాంగ్రెస్ నాయకుడు సద్ది సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్ష దీపార్చన కార్యక్రమాన్ని రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ ఆలయం వద్ద లక్ష దీపాలు ఏర్పాటు చేశారు. మహిళలు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని దీపార్చనలో పాల్గొన్నారు. ప్రవచనకర్త అనంతలక్ష్మీ ప్రవచనాలు చేయగా జబర్దస్త్ ఫేం గుండు మురళి కామెడీ ప్రదర్శనలు చేశారు. భాస్కర్ బృందం సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పానుగంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



లక్ష దీపార్చన



మహిళల ఆటపాట